సాక్షి నల్లగొండ
శనివారం । 8 । జూన్ । 2024



ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

ఇద్దరు చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి ఆరు తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. - 8లో



డబ్బులు స్వాహాపై విచారణ

ఆత్మకూరు(ఎం) మండలం సర్వేపల్లిలో ఉపాధి డబ్బులు స్వాహా చేసిన ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. - 10లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

- ఎస్పీ చందనా దీప్తి



మాట్లాడుతున్న ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థి తరఫున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి అన్నారు. శుక్రవారం ఆమె నల్లగొండలోని దుప్పలపల్లి గోదాములో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని.. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ విడుదల

రామగిరి(నల్లగొండ): ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్య కమిషనర్ ఏ.దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. టెట్ అర్హతతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈనెల 8 నుంచి 30 వరకు బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. అయితే ఉద్యోగ విరమణకు మూడేళ్ల సమయం ఉన్న వారికి మాత్రం ప్రభుత్వం బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చింది.

నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలి

నల్లగొండ టూటౌన్‌: హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీలేని నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.స్వాతి అన్నారు. శుక్రవారం ఆమె నల్లగొండలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు హోటళ్లలో వంట గదులను పరిశీలించారు. రంగులు కలిపిన ఆహార పదార్థాలు, సాస్ బాటిళ్లు, పెరుగు, అల్లంను అనుమానిత ఆహార నమూనాలుగా సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. కొన్ని హోటళ్లలో వంట గదులు అపరిశుభ్రంగా ఉండడంతో వాటి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంపిళ్లు కల్తీవని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట పలువురు అధికారులు ఉన్నారు

పెండింగ్ డీఏలను ప్రకటించాలి

సూర్యాపేట టౌన్‌: ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సూర్యాపేటలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు సోమయ్య అధ్యక్షతన జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ఈ నెల 12న పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్‌బుక్స్, యూనిఫాం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్రఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, అరుణ భారతి, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు వీరారెడ్డి, పాపి రెడ్డి, నాగేశ్వరరావు, రమేష్, సాంబయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజలి సేవోత్సవం



ఊంజలి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో సేవను ఊరేగించారు. సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్ఠింపజేసి ఊంజలి సేవ నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన నాద స్వరం వినిపించారు. అనంతరం హారతినిచ్చారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాత సేవ, ఆరాధన, అర్చనలు, నిత్యకల్యాణం, సుదర్శన హోమం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

ముగిసిన లెక్కింపు

- మూడు రోజులు ఉత్కంఠగా సాగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్
- మొదటి, రెండో ప్రాధాన్యతలోనూ మల్లన్నకే మెజారిటీ
- రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



శుక్రవారం రాత్రి 12.45 గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అందుకున్న ధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న తీన్మార్ మల్లన్న, చిత్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ మూడు రోజులు నిర్విరామంగా కొనసాగింది. పగలు, రాత్రి ఆగకుండా అధికారులు సిబ్బంది మూడు విడతలుగా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా కొనసాగించారు. ఈ నెల 5వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ 7వ తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగింది. 5వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ బాక్సుల్లోని పేపర్లను తీసి 25 ఓట్ల చొప్పున కట్టలుగా కట్టే ప్రక్రియను పూర్తిచేశారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. బుధవారం రాత్రంతా కొనసాగింది. గురువారం రాత్రి వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును పూర్తి చేశారు. అయితే ఈ మొదటి ప్రాధాన్యతలో పోటీ చేసిన 52 మంది అభ్యర్థుల్లో ఏ ఒక్కరికి కూడా గెలుపునకు నిర్ణయించిన టార్గెట్ కోటా ఓట్లు 1,55,095 రాకపోవడంతో ఎలిమినేషన్ రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం రాత్రి వరకు లెక్కించారు.

రెండో ప్రాధాన్యతలోనే తేలిన లెక్క

ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠగా సాగింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ప్రతి రౌండ్‌లో మల్లన్న మెజార్టీ సాధించినప్పటికి గెలుపునకు సరిపడా ఓట్లు రాకపోవడంతో కౌంటింగ్ అంతా ఉత్కంఠగా సాగింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొదటి రౌండ్‌లో తీన్మార్ మల్లన్నకు 36,210 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 28,540 ఓట్లు వచ్చాయి. ఇందులో మల్లన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే 7,670 ఓట్ల మెజార్టీ సాధించారు. రెండో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 34,574 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 27,574 ఓట్లు వచ్చాయి. ఈ రెండో రౌండ్‌లో కూడా 7వేల ఓట్ల ఆధిక్యంలో మల్లన్న ఉన్నారు. 3,4 రౌండ్లలో కలిపి మల్లన్న 52,029 ఓట్లు సాధించగా బీఆర్‌ఎస్ అభ్యర్థికి 48,134 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ రౌండ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే 3,895 ఓట్ల అధిక్యత సాధించారు. దీంతో మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొత్తం 18,565 ఓట్ల ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి నిలిచారు.



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ ఆధిక్యతే..

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ మల్లన్న ఆధిక్యం సాధించారు. 52 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా మొదటి ప్రాధాన్యత ఓట్లలో మల్లన్న ఆధిక్యంలో ఉన్నా.. గెలుపునకు అవసరమైన 1,55,096 ఓట్లు రాలేదు. మొదటి ప్రాధాన్యతలో 1,22,813 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో గెలుపునకు ఇంకా 32,282 ఓట్లు రావాల్సి ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు 1,04,248 ఓట్లు వచ్చాయి. ఆయన గెలుపు లక్ష్యం చేరుకోవాలంటే 50,840 ఓట్ల అవసరం ఉంది. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేస్తూ రెండో ప్రాధాన్యత, సబ్ పార్సిల్ ఓట్లను కూడా లెక్కిస్తూ వచ్చారు. ఇలా తక్కువ ఓట్లు వచ్చిన 48 మంది అభ్యర్థులను ఎలిమినేట్ చేసి వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లతో పాటు సబ్ పార్సిల్(ఇతర ప్రాధాన్యతలు) ఓట్లు లెక్కించారు. దీంతో మిగిలిన నలుగురు అభ్యర్థుల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 1,24,899 ఓట్లకు చేరుకోగా, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 1,05,524 ఓట్లు వచ్చాయి. కాగా, బీజేపీ అభ్యర్థి 43,096 ఓట్లకు చేరుకున్నారు. అయినప్పటికీ గెలుపు టార్గెట్‌కు ఎవరూ చేరుకోకపోవడంతో 4వ స్థానంలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి అశోక్‌ను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత, సబ్ పార్సిల్ ఓట్లను లెక్కించారు. అప్పటికీ టార్గెట్ రాకపోవడంతో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయన ఓట్లను లెక్కించారు. అయినా కూడా కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే అధిక మెజారిటీ ఉన్నా గెలుపు టార్గెట్‌కు సరిపడా ఓట్లు రాలేదు. అయితే మల్లన్న గెలిచినట్లే అయినప్పటికి టెక్నికల్‌గా మాత్రం టార్గెట్ చేరుకునేందుకు తక్కువ ఓట్లు వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు. టెక్నికల్‌గా రాకేష్‌రెడ్డి ఓట్లను టార్గెట్ వచ్చేంత వరకు లెక్కించాల్సి ఉన్నందున ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ఆ తర్వాత ఎన్నికల అధికారులు మల్లన్నకు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయనున్నారు. మొత్తానికి కౌంటింగ్ ప్రక్రియ మూడు రోజుల పాటు సాగింది. ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యాన్ని కనబర్చినా తక్కువ మెజారిటీ రావడం వల్ల ప్రతి రౌండ్ ఉత్కంఠగానే సాగింది.

రేపే గ్రూపు–1 ప్రిలిమినరీ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా 47 కేంద్రాలు



నల్లగొండ: ఈనెల 9న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 16,899 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ విధించనున్నారు. పరీక్ష కేంద్రాలకు 3 కిలోమీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో బందోబస్తుతోపాటు, అభ్యర్థులు లోనికి వెళ్లే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రాల్లో ఇప్పటికే అన్ని రకాల వసతులు కల్పించారు. అత్యవసర వైద్యసేవలకు కూడా ఏర్పాట్లు చేశారు.

అభ్యర్థులకు సూచనలు..

పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపే కేంద్రాలకు చేరుకోవాలి. 10 గంటల తర్వాత వస్తే అనుమతి ఉండదు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే మొబైల్ ఫోన్ అనుమతి ఉంటుంది. అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు మాత్రమే వేసుకొని రావాలి. పరీక్ష పూర్తయ్యేంతవరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రం వదిలి వెళ్లరాదు. పరీక్ష కేంద్రం వదిలి వెళ్లే ముందు తప్పనిసరిగా ఓఎంఆర్ ఆన్సర్ షీట్లు అప్పగించాలి. పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రారంభమవుతుంది. పరీక్ష ముగిసి వెళ్లేటప్పుడు కూడా తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ వేయని వారి ఓఎంఆర్ ఆన్సర్ షీట్ల మూల్యాంకనం చేయరు. అభ్యర్థులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకుని వస్తే ఇబ్బంది లేకుండా ఉంటుంది. హాల్ టికెట్లు రాని అభ్యర్థులు tspsc.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- జెన్‌కో సీఈ మహేష్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి: పుట్టంగండి ఎత్తిపోతల పథకం నుంచి జంట నగరాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని తెలంగాణ జెన్‌కో సీఈ మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్ద అడిశర్లపల్లి మండలం ఏఎమ్మార్ ప్రాజెక్టు పుట్టంగండిలోని సాగర్ వెనుక జలాల వద్ద జలమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర మోటార్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రోచ్ కెనాల్‌లో కనీస నీటిమట్టం 510 అడుగులకు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి సరఫరాలకు అంతరాయం కలిగిస్తున్న కాలువలోని చెట్లను తొలగించాలన్నారు. అనంతరం పుట్టంగండి పంప్ హౌజ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట టీజీ జెన్‌కో ఎస్‌ఈ రఘురాం, డీఈ నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, శ్రీధర్, బాల్‌రెడ్డి, ఏడీఈ సుధాకర్, సంజీవరెడ్డి, పత్యారాయణ తదితరులు ఉన్నారు.



పుట్టంగండి అప్రోచ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న జెన్‌కో సీఈ మహేష్‌కుమార్

ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ఇప్పించాలని ధర్నా



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్‌: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద దళిత, గిరిజన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రాయితీలు, సౌకర్యాలు పొందుతున్న ప్రైవేట్ పాఠశాలలు, దళిత, గిరిజన విద్యార్థులకు సీట్లు కేటాయించడం లేదని ఆరోపించారు. విద్యార్థి తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండలో గుర్తింపు పొందిన పలు ప్రైవేట్ పాఠశాలల్లో బెస్టు అవైలబుల్ స్కీమ్ కింద దళిత గిరిజన విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, నాయకులు బొట్టు శివకుమార్, కొడిరెక్క మల్లమ్మ, పెరిక విజయ్‌కుమార్, బొల్లు రవీందర్, వంటెపాక్రిష్ణ, కోడిరెక్క రాధిక, పెరిక విజయ్‌కుమార్, బాబురావు, నాగార్జున, మల్లయ్య, దేవయ్య, అచ్చాలు, శివలింగం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట): ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల లోపు అనాథ, పాక్షిక అనాథ, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన బాలకార్మికులు, బాల్య వివాహాలు, వేధింపులతో బాధపడుతున్న బాలికల కోసం సూర్యాపేటలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారిణి వెంకటరమణ శుక్రవారం తెలిపారు. కులం, ఆదాయ ధ్రువీకరణ (అనాథ బాలికలకు అవసరం లేదు), తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ, బోనఫైడ్, ఆధార్‌కార్డులతో దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు బాలభవన్, మహిళా శిశు, వికలాంగుల వయోవృద్ధుల శాఖ కమ్యూనిటీ హాల్ జమ్మిగడ్డలో సంప్రదించాలని తెలిపారు.

రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు జరిమానా

- మరో ఆస్పత్రికి నోటీసులు జారీ
- ఆరోగ్యశ్రీ నిధులు నొక్కేస్తున్నారు! కథనంపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నల్లగొండ టౌన్‌: ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ గుండె సంబంధిత రోగుల నుంచి వివిధ పరీక్షల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేసిన రెండు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఒకదానికి రూ.3 లక్షలు, మరోదానికి రూ. 1.5 లక్షల చొప్పున ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రధాన కార్యాలయం అధికారులు జరిమానా విధించినట్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు నల్లగొండ జిల్లా మేనేజర్ వంశీ కృష్ణ తెలిపారు. జిల్లాలోని ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివిధ రకాల పరీక్షలకు ఫీజులు వసూలు చేస్తూ.. తిరిగి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిధులను కాజేస్తున్న ఆస్పత్రుల తీరుపై శుక్రవారం 'సాక్షి'లో ఆరోగ్యశ్రీ నిధులు నొక్కేస్తున్నారు! అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు స్పందించింది. రెండు ఆస్పత్రులకు జరిమానా విధించడంతోపాటు ఆర్థోపెడిక్ సంబంధించిన మరో ఆస్పత్రికి నోటీసులు జారీ చేసినట్టు వంశీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య మిత్రలో ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఆరోగ్యశ్రీ సేవలను పొందుతున్న రోగులను పర్యవేక్షిస్తున్నప్పటికి కొన్ని ఆస్పత్రుల వారు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నా వివిధ పరీక్షలు చేసి రోగుల నుంచి ఫీజులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చేరిన రోగల నుంచి డబ్బులు వసూలు చేసినా చికిత్సలో ఆలస్యం చేసినా, ఇబ్బందులకు గురి చేసినా ఆరోగ్యమిత్రకు గాని, జిల్లా స్థాయి అధికారికి గాని, 104 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పగలంతా ఎండ.. రాత్రి వాన

- మూడ్రోజులుగా వాతావరణంలో వింత మార్పులు
- జిల్లాలో 17.4 మి.మీ. వర్షపాతం నమోదు
- ఊపందుకున్న సాగు పనులు



తిరుమలగిరిసాగర్ మండలం లక్ష్మీపురంతండాలో బత్తాయిలో నిలిచిన వర్షపునీరు

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో మూడ్రోజులుగా వాతావరణంలో వింత మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగలంతా ఎండ కొడుతూ రాత్రి 9 గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. 15 రోజుల క్రితం వరకు ఎండల తాకిడిని తట్టుకోలేక అవస్థలు పడ్డ ప్రజలు రోహిణి కార్తె ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండడంతో 46 డిగ్రీల ఉష్ణోగ్రతల నుంచి 42 డిగ్రీల వరకు పడిపోయి కాస్త ఉపశమనం పొందుతున్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా వాతావరణం మబ్బులతో కూడి 40 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదై చల్లబడినప్పటికి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

అధిక వర్షపాతం నమోదు

జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి శుక్రవారం నాటికి సాధారణ వర్షపాతం సగటున 16.6 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 108.0 మి.మీ. అత్యధిక వర్షం కురిసింది. చిట్యాల మండలంలో సాధారణ వర్షం 19.3 మి.మీ. కురవాల్సి ఉండగా 23.7 మి.మి. అధిక వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో సాధారణం కంటే రికార్డు స్థాయిలో అత్యధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో నైరుతి రుతు పవనాలు వారం రోజుల ముందుగానే జిల్లాను తాకడంతో కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, వంగలు పొంగుతూ చెరువులు సైతం అలుగులు పోస్తున్నాయి. సీజన్ ఆరంభంలోనే సాధారణ కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో జిల్లా రైతులు సాగుకు సమాయత్తమై పత్తి విత్తనాలు విత్తుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరికొని ప్రాంతాల్లో వరినార్లు పోసుకునేందుకు మడులను సిద్ధం చేసుకుంటున్నారు.

వర్షపాతం వివరాలు ఇలా..

జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 17.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నిడమనూరు 60.3 మిల్లీ మీటర్ల వర్షం, కేతేపల్లి 59.0 వర్షం కురవగా అత్యల్పంగా నేరడుగొమ్ములో 0.5 మి.మీ. వర్షం కురిసింది. అలాగే గుండ్లపల్లిలో 41.9 మి.మీ., అనుముల హాలియా 41.8, తిరుమలగిరి సాగర్ 37.0, పెద్దవూర 31.1, మాడుగులపల్లి 27.1 అడవిదేవులపల్లి 25.5, నల్లగొండ 24.2, శాలిగౌరారం 23.4, నకిరేకల్ 22.9, నార్కట్‌పల్లి 21.1, త్రిపురారం 19.0, మిర్యాలగూడ 17.5, కట్టంగూర్ 14.6, గుర్రంపోడు 10.7 మి.మీ. వర్షం కురిసింది. దేవరకొండలో 9.5, కనగల్ 9.1, వేములపల్లి 8.5, చిట్యాల 6.9, మునుగోడు 6.6, చండూరు 6.1, దామరచర్ల 5.7, తిప్పర్తి 5.6, పీఏపల్లి 5.6, గట్టుప్పల్ 5.3, నాంపల్లి 4.7, చింతపల్లి 2.2, కొండమల్లేపల్లి 1.7, చందంపేట 0.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



నల్లగొండ మండలం గుండ్లపల్లిలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

నల్లగొండ టూటౌన్‌: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని పంచాయతీరాజ్ (పీఆర్) శాఖ ఎస్‌ఈ తిరుపతయ్య అన్నారు. నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సమ్మర్ స్పెషల్ బ్యాడ్మింటన్ శిక్షణ ముగింపు సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పంతులు శ్రీనివాస్ క్రీడాకారులకు అల్పాహారం, పండ్లు, పంపిణీ చేశారు. ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఈ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. విద్యా, ఉద్యోగరంగాల్లో క్రీడా రిజర్వేషన్ కూడా వర్తిస్తుందన్నారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యారాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు యాట గోవర్ధన్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, వై.శ్రీధర్‌రెడ్డి, బండారు రమేష్, ఎస్.హేమంత్, మురళి పాల్గొన్నారు.



క్రీడాకారులకు అల్పాహారం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి పతకాలు

భువనగిరి: హన్మకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించిన పురుషుల, మహిళల యూత్ ఛాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. నాలుగు గోల్డ్, ఎనిమిది సిల్వర్ మెడల్స్ సాధించారు. మహిళల విభాగంలో 10 వేల మీటర్ల రన్నింగ్ పోటీల్లో మల్లిక ప్రథమ, 5 వేల మీటర్ల పరుగులోనూ మల్లిక ద్వితీయ స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో 5 వేల మీటర్ల పరుగు పందెంలో సునీల్ మొదటి స్థానంలో నిలిచారు. డిస్కస్ త్రోలో సచిన్ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరితో పాటు చంద్రశేఖర్ ప్రసాద్, నిఖిత ,ప్రదీప్, బుచ్చమ్మ, ఉషారాణి, రాహుల్ పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ తదితరులు అభినందించారు. .



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది



బ్యాలెట్ పేపర్లను వేరు చేస్తున్న సిబ్బంది



ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన



కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లు



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన



ఎన్నికల అధికారికి బ్యాలెట్ పేపర్లు చూపుతున్న సిబ్బంది



బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

మహిళ మృతదేహం లభ్యం

దేవరకొండ : పట్టణంలోని మార్కెట్ యార్డులో ఓ వివాహిత మృతదేహం లభ్యమైంది. దేవరకొండ పోలీసులు తెలిపిన ప్రకారం.. నాంపల్లి మండలం లింగోటం గ్రామానికి చెందిన దుబ్బ శోభ (45)కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో తల్లి గారి గ్రామమైన చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి శోభ ఇటీవల వచ్చింది. అయితే గురువారం సాయంత్రం నుంచి గ్రామంలో కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబీకులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. కాగా శుక్రవారం దేవరకొండ మార్కెట్‌యార్డులో గల డ్రెయినేజీలో శోభ విగత జీవిగా కనిపించింది. గమనించిన స్థానిక వ్యాపారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేట్టారు. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

మిర్యాలగూడ టౌన్ : ఓ ఇంట్లో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మిర్యాలగూడ మండలం బాదలాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాదలాపురం గ్రామానికి చెందిన బంటు కృష్ణ ఇంటి వరండాలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వరండాలో 15 బస్తాలు (7 క్వింటాళ్లు) నిల్వ ఉండగా వాటిని పరిశీలించి పీడీఎస్ బియ్యంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బంటు కృష్ణను ప్రశ్నించగా ఆ బియ్యం తనకు సంబంధించినవి కావని, తన అన్న బంటు వెంకటేశ్వర్లుకు చెందినవని తెలిపారు. వివిధ గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని తన ఇంటి వద్ద ఉంచాడని వివరించారు. ఈ మేరకు అన్నదమ్ముళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. లబ్ధిదారుల నుంచి ఎవరైనా పీడీఎస్ బియ్య సేకరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కండక్టర్‌పై దాడిచేసిన వ్యక్తికి జైలు

రామన్నపేట : విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై దాడిచేసిన వ్యక్తికి రామన్నపేట అదనపు కోర్టు జడ్జీ ఎస్.చందన మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలంలోని అంబబావిగూడెం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్‌రెడ్డి మార్చి 15వ తేదీన చౌటుప్పల్ నుంచి రామన్నపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సులో జైకేసారం వద్ద ఎక్కాడు. ఈ క్రమంలో టికెట్ తీసుకోవాలని అడిగిన కండక్టర్ చిలుకల నర్సింహపై మద్యం మత్తులో చేయి చేసుకున్నాడు. ఈ దాడిలో కండక్టర్ కుడి కన్ను కింద గాయమైంది. కండక్టర్ చిలుకల నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.మల్లయ్య కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధితుడి పక్షాన ఏపీపీ పి.వెంకట అవినాష్ వాదించారు.

ఆటో, బైక్ ఢీ.. ఐదుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం

మిర్యాలగూడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం మిర్యాలగూడ మండలంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన ఇటికాల రాకేష్ చెల్లెలు వివాహం ఇటీవల నిశ్చయమైంది. దీంతో ఇటికాల రాకేష్ మిర్యాలగూడ పట్టణం రామచంద్రాగూడెంకు చెందిన తమ బంధువు దర్శనం నవీన్‌తో కలిసి పెళ్లి కార్డును త్రిపురారంలో తమ బంధువులకు ఇచ్చి తిరిగి మిర్యాలగూడకు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి నిడమనూరు వైపు వెళ్తున్న ఆటో మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్ద వారి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న రాకేష్, నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో పల్టీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన వంశీ, శాంతినగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సబావటు శివ, త్రిపురారంకు చెందిన దండమళ్ల అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఆటో డ్రైవర్ శివ ఏరియా ఆస్పత్రిలో.. నవీన్, రాకేష్, శివ, వంశీ, అశోక్‌లు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా వీరిలో రాకేష్, నవీన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మిర్యాలగూడ రూరల్ ఏఎస్ఐ బి.యాదగిరి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్, ఆటో

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన శ్రీను

నడిగూడెం : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బృందావనపురంకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు దొంతగాని శ్రీను శుభకార్యానికి ఖమ్మం జిల్లాలోని నాయకన్‌గూడెం తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కాగితరామచంద్రాపురం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో శ్రీను కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్

భువనగిరి క్రైం : చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి ఆరు తులాల బంగారం, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు రిమాండ్ చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం డీసీపీ రాజేష్ చంద్రా భువనగిరిలోని తన కార్యాలయంలో వెల్లడించారు. జనగాం జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి సీతారాంపురం గ్రామానికి చెందిన నల్ల శ్రీకాంత్, అతడి సోదరుడు నల్ల పరమేష్ మార్చి నెలలో గుండాల మండలం అనంతారం గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించారు. అదే విధంగా భువనగిరి మండలంలోని జమ్మాపురం గ్రామంలో లూర్దమ్మ మెడలో మూడు తులాల బంగారు పుస్తెతాడు దొంగిలించారు. కాగా వీరిద్దరు ఒక మోటార్ సైకిల్ తీసుకుని నంబర్ ప్లేట్ మార్చి, మోటార్ సైకిల్‌లకు ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చి తిరుగూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు గుండాల, భువనగిరి పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు సమష్టిగా ఆపరేషన్ నిర్వహించారు. గుండాల మండలం గంగాపురం ఎక్స్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నల్ల శ్రీకాంత్, అతడి సోదరుడు నల్ల పరమేష్ తిరుగుతుండగా అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి ఆరు తులాల బంగారు గొలుసులు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో యాదగిరిగుట్ట ఏసీపీ పి.రమేష్ కుమార్, సీఐ ఎం.కొండల్‌రావు, గుండాల ఎస్ఐ యాకన్నలు పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ ప్రశాంత్, సైదులు, వినోద్‌లను అభినందించి రివార్డుతో సత్కరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్రా

కోతుల దాడిలో గాయపడిన వృద్ధురాలి మృతి

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని ప్రగతి నగర్‌లో రెండు నెలల క్రితం కోతుల దాడిలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రగతి నగర్‌కు చెందిన ఏలె లక్ష్మమ్మ(75) రెండు నెలల క్రితం ఇంటి ఆరు బయట నడుచుకుంటూ వస్తుండగా అక్కడే ఉన్న కోతులు ఆమెపై దాడి చేశాయి. లక్ష్మమ్మ భయంతో పరిగెత్తే క్రమంలో కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె వెన్నెముక విరిగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమెకు శస్త్ర చికిత్స చేయడానికి అవకాశం లేదని ఇంటికి తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. రెండు నెలలుగా మంచానికే పరిమితమైన లక్ష్మమ్మ ఆరోగ్యం క్రమంగా క్షీణించి గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



లక్ష్మమ్మ(ఫైల్)

విద్యుత్ ఏడీఈ కి ఫిర్యాదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో విద్యుత్ మీటర్ రీడింగ్‌లో అవకతవకలకు పాల్పడుతున్నారని విద్యుత్ వినియోగదారులు శుక్రవారం విద్యుత్ ఏడీఈ వెంకన్నకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుడు ఎస్ వెంకటాచారి మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా తన ఇంటిని అద్దెకు ఇచ్చిన వ్యక్తితో లాలూచీ పడి మీటర్ రీడింగ్‌లో వ్యత్యాసాలు చూపిస్తూ బిల్లులు ఇస్తున్నట్లు ఆరోపించారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య



రాజ్‌కుమార్

రాజాపేట : మానసిక పరిస్థితి బాగాలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటి నర్సయ్య పెద్ద కుమారుడు గుంటి రాజ్‌కుమార్ (25) చదువు పూర్తి చేసుకుని సిద్దిపేట జిల్లా మూడు మరుకుక్క మండలం కరకపట్ల సమీపంలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ ఇంటి నుంచే బైక్‌పై రాజ్‌కుమార్ విధులకు వెళ్లేవాడు. కాగా మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో రాజ్‌కుమార్ గురువారం సాయంత్రం గ్రామం శివారులోకి వెళ్లి తనతో తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని తాను చనిపోతున్నానని వాట్సాప్ స్టేటస్ పెట్టాడు. ఆ వాట్సాప్ స్టేటస్ చూసిన రాజ్‌కుమార్ మిత్రుడు బలరాం.. అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోగా రాజ్‌కుమార్ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వారు 108 కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా శుక్రవారం ఉదయం రాజ్‌కుమార్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మైసయ్య తెలిపారు.

డీఈఈ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీఈఈ) రెండేళ్ల (2024–26)కోర్సుల్లో చేరేందుకు నోటిఫికేషన్ విడుదలైందని నల్లగొండ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నర్సింహ తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ బేస్డ్ టెస్టు(సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు ఈ నెల 8 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 2024 సెప్టెంబర్ 1 నాటికి 17 ఏళ్లు పూర్తయినవారు అర్హులని తెలిపారు.వివరాలకు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని ప్రవేశ పరీక్ష జూలై 10న నిర్వహించనున్నారు.

ఉరివేసుకుని విద్యార్థి బలవన్మరణం



రాహుల్ (ఫైల్)

పెన్‌పహాడ్ : మనస్తాపానికి గురై విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని రత్యాతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య రాహుల్ (18) ఇంటర్మీడియేట్ పూర్తి చేశాడు. డిగ్రీలో సీటు రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఉదయం తల్లిదండ్రులు ఉపాధి హామీ పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రులు వచ్చేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి భూక్య కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

రామన్నపేట : విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని మునిపంపుల గ్రామశివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన చిల్ల వెంకటయ్య ఐదు పాడిగేదెలు గురువారం మేతకు వెళ్లి మూడు మాత్రమే తిరిగి వచ్చాయి. మిగిలిన రెండింటి కోసం రైతు వెంకటయ్య గాలించగా జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం మునిపంపుల శివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చనిపోయి ఉండడం చూసిన రైతులు బాధితుడికి సమాచారం అందించారు. గేదెలు ట్రాన్స్‌పార్మర్ తీగలకు తగిలి మృతి చెందింది.

రామగిరి(నల్లగొండ): విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని రామలింగాలగూడెం గ్రామానికి చెందిన వనపర్తి కృష్ణయ్యకు చెందిన నాలుగు గేదెలను మేపడానికి అదే గ్రామానికి చెందిన వనపర్తి బుచ్చయ్య పొలంలోకి తోలుకెళ్లాడు. మ ధ్యాహ్న సమయంలో అందులో ఓ గేదె సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది.

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని మిద్దనపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోరగుండ్ల చంద్రయ్య తన గేదెను శుక్రవారం ఉదయం మేతకు వదిలాడు. అయితే గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడడంతో గేదె ఆ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందింది.

మిర్యాలగూడ : విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మోదాల రాంమల్లి, అప్పనబోయిన శ్రీను, నిమ్మన లింగయ్యలకు చెందిన మూడు గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు.

రెండు ఇళ్లలో బంగారు ఆభరణాల చోరీ

భువనగిరి క్రైం : భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామంలో గురువారం రాత్రి రెండు ఇళ్లల్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కాపురం గ్రామానికి చెందిన గోపగాని నవీన్, జనగాం చంద్రశేఖర్ ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో దొంగతనానికి పాల్పడ్డాడు. జనగాం చంద్రశేఖర్ రాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాను ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి వస్తువులను చిందరవందరగా పడేసి, అందులో ఉన్న తులం చెవి కమ్మలు, రెండు తులాలు బంగారు గుండ్లు, చైన్, 22 తులాల వెండి కాళ్ల పట్టా గొలుసులు, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే గోపగాని నవీన్ అతడి భార్య ప్రసన్న ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరడబడి డ్రెస్సింగ్ టేబుల్‌లో దాచుకున్న ఐదు తులాల వెండి, కాళ్ల పట్టీలు, వెండి చెవి రింగులు దొంగిలించారు. చప్పుడు కావడంతో ప్రసన్న లేచి వారిని చూసి అరిచింది. దుండగులు ఆమెను బెదిరించి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, ఒకటిన్నర తులం బంగారు తాడును లాక్కెళ్లారు. అదేవిధంగా కోసన మల్లయ్య ఇంటి వద్దకు దుండగులు వెళ్లగా కుటుంబ సభ్యులు లేచి అరవడంతో పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

దేవరకొండ: పట్టణంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారంతోపాటు రూ.2లక్షల పదివేల నగదును చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ నగర్‌లో శింగం జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శుక్రవారం కొండమల్లేపల్లిలో శుభకార్యం ఉండడంతో జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంట్లో బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండడాన్ని గుర్తించి చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని దేవరకొండ సీఐ నర్సింహులతోపాటు క్లూస్ టీం సభ్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. జ్ఞానేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

బొలేరో వాహనం ఢీకొని బాలుడి దుర్మరణం

బొమ్మలరామారం (తుర్కపల్లి) : మహేంద్ర బొలేరో వాహనం ఢీకొని ఓ బాలుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలంలోని వేల్పుపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రెంకల బాలరాజు కుమారుడు శశి (2) వారి ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. బాలరాజు ఇంటి సమీపంలో వాటర్ ప్లాంట్ ఉంది. ప్లాంట్ వద్ద నీటిని క్యాన్లలో నింపుకున్న బొలేరో వాహనం రివర్స్ తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శశిని ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన శశి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పక్యాద్దీన్ తెలిపారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

- ఇన్‌చార్జ్ ఏడీఏ పి.సందీప్‌కుమార్



పి.సందీప్‌కుమార్

పెద్దవూర: వివిధ పంటల్లో తొలి దశలో విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చే పురుగులను నియంత్రించడానికి తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏడీఏ పి.సందీప్‌కుమార్ తెలిపారు. విత్తన శుద్ధితో మొలక శాతం పెరగడంతోపాటు తొలుత 30 రోజుల వరకు పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వివిధ పంటల సాగుతో విత్తన శుద్ధి ఎలా చేయాలో ఆయన వివరించారు.

వరి: కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దుంప నారుమడులకు అయితే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ మందు కలిపి ఈ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి. మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని నారుమడిలో చల్లుకోవాలి.

సోయాబీన్: కిలో విత్తనాలకు 2 గ్రాముల థైరమ్ • ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి, 1.5 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్‌తో విత్తన శుద్ధి చేయాలి. విత్తే గంట ముందు 10 కిలోల విత్తనాలకు 200 గ్రాముల రైజోబియం జపానీకం కల్చర్‌ను నీరు, జిగురుతో పట్టించి నీడలో ఆరబెట్టాలి.



విత్తన శుద్ధి చేస్తున్న వ్యవసాయ కూలీలు

జొన్న: కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందు కలిపి శుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సం మందును కలపాలి.

పత్తి: పత్తిలో రసం పీల్చు పురుగుల తాకిడి ఎక్కువ. బీటీ పత్తిని పండిస్తున్న రైతులు కూడా పిండి నల్లీ, నులి పురుగులతో ఇబ్బందులు పడుతున్నారు. వీటి నివారణకు కిలో విత్తనానికి తగినంత జిగురు కలిపి 9 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ లేక 5 గ్రాముల థయోమిథాక్సమ్ 70డబ్ల్యూపీఎస్. 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేయాలి.

పాడి పంట

మొక్కజొన్న: కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరమ్ లేదా కాప్టాన్‌తో శుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

కంది: కందిలో విత్తనం ద్వారా సంక్రమించే ఎండు తెగులును నివారించడానికి తెగులును తట్టుకునే రకాలను సాగు చేయడంతో పాటు 10 గ్రాముల ట్రైకోడర్మా విరిడే కలిపి శుద్ధి చేసుకోవాలి.

పసుపు: పసుపు పంటను దుంప వేరు కుళ్లు, ఆకు పచ్చ తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు లీటరు నీటికి 3 గ్రాముల మ్యాంకోజెబ్ లేదా 3 గ్రాముల మెటలాక్సీస్ ఎంజెడ్ కలిపి ఆ ద్రావణంలో 40 నిమిషాల సేపు కొమ్ములను ఉంచాలి. అనంతరం నీడలో ఆరబెట్టాలి. పసుపు కొమ్ము/విత్తనాలకు పొలుసు పురుగు ఆశిస్తే శిలింద్ర నాశినితోపాటు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల మలాథియాన్, 2 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ కలిపి నీడలో ఆరబెట్టి నీరు మార్చి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడే కలిపిన ద్రావణంలో ముంచి కొమ్ములను నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.